కథ

బ్లాక్‌బోర్డు మీద డిమాండ్ సప్లయ్ గ్రాఫ్ గీస్తున్న నేను "మేడమ్...నోటీస్" అన్న ప్యూన్ పిలుపుకి వెనక్కి తిరిగి చూశాను. చేతిలో బుక్‌తో నా టేబుల్ దగ్గర కనిపించాడు రాములు. చాక్‌పీస్, డస్టర్ టేబుల్‌పైన ఉంచి నోటీస్ అందుకుని మనసులోనే చదివి టేబుల్‌పైన అన్చి సైన్ చేస్తుంటే ఫ్రంట్ రోలోని రాకేష్ లేచి ఆత్రంగా అడిగాడు.

"ఏంటీ మేడమ్ ఏదైనా టూర్ ప్రోగ్రామా?"

నేను తలపైకి ఎత్తకుండానే అడ్డంగా ఊపాను.

"ఎలక్షన్స్ నోటీను అయ్యుంటుంది. ఏం మేడమ్" రాధిక ప్రశ్నించింది. నేను బుక్ రాములుకి తిరిగి ఇచ్చేసి "ఇంక అక్కడితో మీ ఊహలు ఆపండి మీరను కునేదేం కాదు. రేపు ఆగస్టు పదిహేను. ప్రతి ఒక్కరూ జెండావందనానికి అటెండ్ కావాలనీ. అలా రాని వారికి ఈ మంత్ స్లిప్ టెస్ట్‌లో మార్కులు కట్ చేయడంతోపాటు స్కాలర్‌షిప్ తీసుకునేవారికి అది కేన్సిల్ చేయబడుతుందని ప్రిన్సిపాల్‌గారు పంపిన ఆ నోటీను సారాంశం." పెన్ కేప్ మూసి వివరంగా చెప్పాను.

నా స్టూడెంట్స్‌తో నాకు మంచి రిలేషన్స్ ఉన్నాయి. అందుకే అశోక్ లేచి "ఏమిటి మేడమ్ మరీ దారుణం. మేము సెకండ్ ఇంటర్ స్టూడెంట్స్‌మి. ఇంకా ఫస్ట్ ఇయర్ క్లాసు స్టూడెంట్స్‌లాగ ఆగస్టు పదిహేనుకి రాకపోతే ఫైన్ వేస్తాం, రిపబ్లిక్‌డేకి రాకపోతే మార్క్సు కట్ చేస్తామని బెదిరించడం ఏం బాగాలేదు" ఉక్రోషంగా అన్నాడు.

"అవును మేడమ్...ఎస్ మేడమ్" అంతా అతన్ని సపోర్టు చేశారు. వాళ్ల ధోరణికి నాకు నవ్వొచ్చింది. సైలెన్స్...సైలెన్స్ అని వాళ్లని శాంతపరిచి...వాళ్ల గోల సద్దుమణిగాకా "మీకేం...మీరు రాకపోతే మీకు మార్క్సు మాత్రమే కట్ అవుతాయి. కానీ లెక్చరర్స్ అయిన మేము రాకపోతే ఆ రోజు జీతం మొత్తం నియర్లీ టూ హండ్రెడ్ రూపీస్ కట్ అయిపోతుంది. చూస్తూ...చూస్తూ...వదులుకోవాలంటే ఎంత కష్టమో ఆలోచించండి" జాలిగా మొహం పెట్టి అడిగాను.

అందరూ నాతో ఏకీభవించారు.

"అసలీ ఇండిపెండెంట్స్‌డేని ఎవరు కనిపెట్రా బాబు" ఎవరో కొంటెగా అరిచారు.

"నమతా వాళ్ల తాత" మరొకరెవరో సమాధానమిచ్చారు.

ఫ్రంట్ రోలో కూర్చున్న నమత ఛర్రున లేచింది. "ఏయ్...మా తాతగారిని ఏదైనా అంటే పళ్లు పీకి చేతికిస్తాను" బాయ్స్‌కేసి తిరిగి రౌద్రంగా అరిచింది.

పరిస్థితి అదుపు తప్పుతోందని డస్టర్‌తో టేబుల్‌ని బాదుతూ "ఉష్...సైలెన్స్...సైలెన్స్" అని అరిచి వాళ్లని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తుండగానే బెల్ మోగింది. నా క్లాసు ముగియడంతో వాళ్ల వాదానికి వాళ్లని వదిలేసి నా బుక్స్‌తో నేను బయటికి నడిచాను.

స్టాఫ్‌రూమ్‌కేసి వెళుతుంటే నమత పరుగున వచ్చి నా ముందు ఆగింది. 'చచ్చాం. ఇప్పుడీ పిల్ల క్లాస్‌రూమ్‌లో గొడవకి నన్ను తీర్పు చెప్పమనదు కదా!' మనసులో గొణుక్కుంటూ పైకి నవ్వుమొహాన్ని పెట్టాను.

పరిగెత్తుకుంటూ రావడం వల్ల వచ్చిన ఆయాసాన్ని

# పండగ

అపుకొంటూ-"మేడమ్...మీరు...మీరు...రేపు మా ఇంటికి రావాలి" పిలిచింది.

"ఎందుకూ?" అర్థం కానట్లు అడిగాను.

"రేపు మా ఇంట్లో గ్రేండ్ ఫంక్షన్ ఉంది మేడమ్. మా తాతగారు, అమ్మ మిమ్మల్ని తప్పకుండా తీసుకురమ్మన్నారు. ప్లీజ్ మేడమ్" రిక్వెస్ట్‌గా అడిగింది. నేను ఇబ్బందిగా కదిలాను. 'వరలక్ష్మీవ్రతం వస్తోందని అమ్మ రేపు బట్టలు కొనడానికి షాపింగ్‌కి వెళ్దాం అంది. ఈ అమ్మాయి ఏమో ఇంటికి పిలుస్తోంది. ఏం చెయ్యాలి' నాలో నేను మధన పడి "రావడానికి ట్రై చేస్తానని" చెప్పి అప్పటికి తప్పించుకున్నాను.

* * *

ఉదయం ఎనిమిదింటికే ఎండ మండిపోతోంది. ప్రిన్సిపాల్, కాలేజ్ కమిటీ మెంబర్స్, లోకల్ రాజకీయ నాయకుడెవరో చీఫ్‌గెస్ట్‌గా పిలిచారు. ఆయనగారు వచ్చేసరికి తొమ్మిదిన్నర అయ్యింది. ముఖ్యమైన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ వంటి వారు తప్ప మిగిలిన స్టాఫ్, పిల్లలు ఎండ తీక్షణతను, చమటల చిరాకును భరిస్తూ స్టేజ్ ఎదురుగా నిలబడి ఉండాల్సి వచ్చింది. పోనీ ఆ జెండా లాగడం అయిపోగానే స్వీట్స్, చాక్లెట్స్ ఇచ్చి పంపేయకుండా, ఒక్కొక్కరూ స్వాతంత్ర్యం గురించి, దేశభక్తి గురించి గంటల తరబడి ఉపన్యాసాలు ఇస్తుంటే పైన ఎండ వేడికి తాళలేక, కాళ్లు పీక్కుపోతూ దాదాపు మూడు గంటలు మా అవస్థ పగవాడికి కూడా వద్దనిపించింది.

పాపం బోటనీ లెక్చరర్ జయకి లోబీపీ ఉందిట. ఆ అమ్మాయి నిలబడలేక తూలిపోతుంటే నేనే చొరవ చేసి ఇద్దరు గర్ల్సునిచ్చి స్టాఫ్ రూమ్‌కి పంపేశాను.

"ఏమిటండీ శారదగారూ...ఎందుకు మనకీ హింస. వెధవ స్వాతంత్ర్యం రాకపోయినా పోయేది" కారిపోతున్న చమటల్ని పదేపదే తుడుచుకుంటూ విసుక్కున్నాడు మేథ్స్ లెక్చరర్ రాఘవ.

"నాకూ అలాగే అనిపిస్తోంది. కానీ ఏం చేస్తాం కర్తవ్యబద్ధులం. అనుభవించాలి. మిడిల్ క్లాసు మనుషులకి ఒక రోజు జీతం గడిచే ఒక అవసరం" సానుభూతిగా కాస్త నిర్లిప్తంగా అనుకొన్నాను.

ఏ దేవుడు మా మొర విన్నాడో పన్నెండింటికి మాకు మోక్షం కలిగింది. కడుపు పట్టినన్ని నీళ్లు తాగి హడావిడిగా మిగతా వ్యవహారాలు పూర్తి చేసుకొని ఒంటిగంటకు ఇంటికి బయలుదేరుతుండగా గేటు బయట నమత మళ్లీ కలిసి మరోసారి వాళ్లింటికి రమ్మని ఆహ్వానించింది. తప్పనిసరై సాయంత్రం వస్తానని మాటిచ్చి బయట పడ్డాను.

అంత హడావిడిలోనూ నమత లంగా ఓణీలో ప్రత్యేకమైన సాంప్రదాయ అలంకరణలో ఆకర్షణీయంగా తయారయ్యిందనే అంశం నా దృష్టిని దాటిపోలేదు.

* * *

సాయంత్రం అమ్మ, నాన్నలకి చెప్పి మేముండే టౌనుకి దూరంగా ఉన్న పల్లెటూరిలోని నమత ఇల్లు వెతుక్కొంటూ వెళ్లాను. అరగంట గతుకుల రోడ్డు ప్రయాణానంతరం బస్సు దిగి నమత తాతగారు సుబ్బరాజుగారి గురించి ఆరా తీశాను. వెంటనే స్పందించిన ఓ పాన్‌షాప్ వ్యక్తి స్వయంగా తన షాపులో పనిచేసే పన్నెండేళ్ల కుర్రాడిని తోడిచ్చి పంపాడు.

నన్ను చూడగానే నమత మొహం వెలిగిపోయింది. "అమ్మా, తాతయ్యా...మా శారదా మేడమ్ వచ్చారు" అంటూ నా చేయి పట్టుకొని లోనికి లాక్కొనిపోయింది. సింహాసనం లాంటి చెక్కకుర్చీలో కూర్చోపెట్టి లోనికి వెళ్లింది.

ఇల్లు పాతకాలపు మండువా లోగిలి. ముందువైపు చాలా పూలమొక్కలు పలకరిస్తున్నాయి. ఓ పక్కగా ఉన్న గిలకబావి శబ్దం కూడా వినసొంపుగా ఉంది. నేను పరిసరాలు గమనిస్తూ ఉండగానే నలభై ఏళ్లు దాటిన ఓ స్త్రీ మూర్తి, డెబ్భై ఏళ్లు దాటిన ఒక వృద్ధుడు అక్కడికి వచ్చారు. వారి వెనకే చేతిలో మంచి నీళ్ల గ్లాసుతో వచ్చింది నమత. నేను లేచి చేతులు జోడించాను. "మా నమత నీ గురించి రోజూ చెబుతుందమ్మా! నువ్వొచ్చాకే దానికి ఎకనామిక్స్‌లో మార్కులు పెరిగాయిట" పరిచయాల అనంతరం అభిమానంగా అంది నమత తల్లి లక్ష్మిగారు.

నాక్కొంచెం ఇబ్బందిగా అనిపించింది ఆ పొగడ్తకు. చిన్నగా నవ్వి ఊరుకున్నాను.

"అమ్మాయికి ఫలహారమేదైనా తీసుకురామ్మా!" తాతగారు హెచ్చరించారు.

"అబ్బే! ఏం వద్దండీ" మొహమాటంగా అన్నాను.

"పండగ పూటా వచ్చి నోరు తీపి చేసుకోకుండా వెళ్లకూ

వి.ఎల్.పద్మసుందరి




డదమ్మా!" ఆయనే అన్నారు. నాకర్థం కాలేదు. 'ఈ రోజేం పండగ?' మనసులో అనుకొన్నాను.

సమత, వాళ్లమ్మగారూ లోనికి వెళ్లిపోయారు.

"ఏమ్మా! మీ తాతగారు స్వాతంత్ర్య సమరయోధులు. పేరు శ్రీరామమూర్తిగారని చెప్పావట మా మనవరాలికి. ఇంతకీ ఆయన మీ మాతామహులా? పితామహులా?" ప్రశ్నించారు.

ఆయన ప్రశ్న అర్థం కావడానికే నాకు నిమిషం పట్టింది. "మా నాన్నగారి తండ్రిగారండి" కాస్త తడబాటుగా అన్నాను.

"ఆయన పొట్టిశ్రీరాములుగారితో కలిసి పనిచేశారట కదా!"

"అవునండీ. మా నాన్నగారు చెబుతుంటారు" చెప్పాను.

"నాకు తెలుసు. మేమిద్దరం కలిసి పనిచేశాం. నిజమైన గాంధేయవాది"

నాకు భరించలేనంత భారంగా ఉంది ఆ సంభాషణ. నాకు ఊహ తెలిసేసరికే మా తాతగారు చనిపోయారు. ఎప్పుడైనా అమ్మానాన్నలు చెప్పినది తప్ప నాకు మా తాత గారి గురించి ఏమీ తెలియదు. ఇప్పుడీయన పదే పదే ఆ వివరాలు అడగడం ఎరక్కపోయి మా తాత ఫ్రీడం ఫైటర్ అని చెప్పి ఇరుక్కొన్నట్లు అనిపిస్తోంది. నన్ను రక్షించడానికా అన్నట్లు సమత పాయసం, సున్నుండలతో వచ్చి చేతికిచ్చింది.

"ఏదో గ్రాండ్ ఫంక్షన్ అన్నావు. ఆ సందడేం లేదే" యథాలాపంగా అడిగాను.

"ఉదయం ఒకసారి అయ్యింది మేడమ్. కాస్త చీకటి పడ్డాకా మళ్లీ మొదలవుతుంది" చెప్పింది.

"ఇంతకీ అసలు విషయం ఏమిటీ?" దట్టించిన నేతి వాసనతో నిండిన ఉండను కొరుకుతూ ఆసక్తిగా అడిగాను.

నిండారా నవ్వారు తాతా మనవరాళ్లు. "ఏం లేదు మేడమ్. ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవం కదా! మా తాతయ్య భారతమాతకి పుట్టినరోజు పండగ చేస్తారు. ఒకప్పుడు తనతో కలిసి పనిచేసిన శ్రీరామమూర్తిగారి మనవరాలు మీరని తెలిసి...తాతయ్య పట్టుబట్టి మిమ్మల్ని పిలిపించారు" సమత చెప్పింది.

నాకు నోరంతా వెగటుగా అయిపోయింది. ప్రొద్దుటి హింస కళ్లముందు కదిలి గుండెలు దడదడలాడాయి. 'మళ్లీ ఇప్పుడీయన దేశభక్తితో వాయిస్తాడా నన్ను', చేతిలో ఉండ ప్లేటులో పడేస్తూ భయంగా అనుకొన్నాను.

అకారణంగానే హఠాత్తుగా పని గుర్తొచ్చినట్లు లేచాను.

"సారీ! సమతా. నువ్వన్నిసార్లు పిలిచావని వచ్చాను కానీ నేను అర్జెంట్‌గా వెళ్లాలి" సమత అయోమయంగా చూసింది.

కానీ ముసలాయన ఘటికుడు. "అబ్బే! ఆలస్యం ఏమీ లేదమ్మా! ఇదిగో రెండు నిమిషాలు అంతే. సమతా వెళ్లమ్మా వెళ్లి దీపాలంకరణ చెయ్యి. అమ్మకి హారతిచ్చి

మీ మేడమ్‌కి ప్రసాదమిచ్చి పంపేద్దాం" నన్ను వారించి నమతను పంపేశాడు. నేను నీరసంగా కుర్చీలో కూలబడ్డాను. అయినా నా అసహనాన్ని దాచుకోలేకపోయాను.

"తాతగారూ! ఇలా అన్నానని మరోలా అనుకోకండి. మన పెద్దవాళ్లు ఏదో సామెత చెప్పినట్లు మన దేశభక్తి మనసులో ఉంటే చాలుగా! దానిని పదే పదే ప్రదర్శించాలంటారా? ఆయన ఒక్క క్షణం విస్మయపడినట్లు చూసి మెల్లగా నవ్వారు.

"నిజమేనమ్మా! ఏ భావనకైనా మనసే ముఖ్యం. కానీ పోగొట్టుకొన్న దానిని పొందినపుడు దానిని నలుగురికీ ప్రదర్శించడంలో తప్పేముంది"

"నాకర్థం కాలేదు" స్పష్టంగా చెప్పాను.

"దేశం పరాధీనమైనప్పుడు మా కష్టాలేంటో, ఎన్నెన్ని త్యాగాలు చేసి మేము మీకు ఈ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల నందించామో మీకు తెలియదు. అందుకే అరగంట ఎండలో నిలబడటం, పది మైళ్లు నడవడం ఇవన్నీ మీకు అయిష్టాలే. కానీ మేము మీకు ఇవి అందించేందుకు ఎన్నెన్ని మైళ్లు నడిచామో, ఎర్రటి ఎండల్లో లాఠీదెబ్బలు భరిస్తూ ఉరితాళ్లను, తుపాకీ గుళ్లను ప్రేమించామో మీకు తెలియదు. అందుకే ఇంత మెటీరియలిస్ట్‌గా ఆలోచిస్తున్నారు" ఆవేదనగా అన్నారు.

నేను దెబ్బతిన్నట్టు చూశాను.

"నేను నిన్ను దెప్పడం లేదమ్మా! ఉదయం కాలేజీలో మీరు పడ్డ బాధ గురించి నమత చెప్పింది. నిజమే అంత నిర్బంధంగా దేశభక్తిని బోధిస్తే ఎవరికైనా బాధాకరమే. కానీ ఒక్కటి చెప్పు. ఈ బాధను మీరు ప్రతీరోజూ అనుభవిస్తున్నారా? లేదే! ఏడాదికి కేవలం రెండు రోజులు. అంతేగా!"

"కాదనడం లేదు తాతగారూ. కానీ దేనినీ బలవంతంగా రుద్దకూడదుగా! ఎంతమంది మనస్ఫూర్తిగా జెండావందనాన్ని నిర్వహిస్తున్నారు. పిల్లలు మార్క్స్ పోతాయని, ఉద్యోగస్తులు జీతాలు కట్ అవుతాయని వస్తారు. ఏ సామాన్యుడైనా తనకు తానుగా జెండా ఎగరవేయడం, నమస్కరించడం నా పాతికేళ్ల జీవితంలో నేనెప్పుడూ చూడలేదు. అలాంటప్పుడు నిర్బంధంగా మాత్రం దీనిని అమలుచేయడం ఎందుకు చెప్పండి?" ప్రశ్నించాను.

"నిర్బంధంగా దేశభక్తిని మనమెక్కడ బోధిస్తున్నామమ్మ...రష్యా, చైనా, స్కాట్‌లాండ్ లాంటి చాలా దేశాల్లో ఎవరు ఏ వృత్తిని ఎన్నుకోవాలన్నా పద్ధెనిమిది ఏళ్లు నిండాకా నిర్బంధంగా కనీసం రెండేళ్లు సైన్యంలో చేరి దేశభక్తి ప్రదర్శించాలి. మనకి అలాంటి చట్టాలేం లేవుగా. ఏడాదికి రెండుసార్లు రెండు నిమిషాలు మాతృభూమిని స్మరించుకోవడం కూడా అసహనంగా అనిపించే వాళ్లకి భారతీయులమని చెప్పుకునే అర్హత కూడా ఉండదు" కచ్చితంగా అన్నట్లు అన్నారు.

"దేశమంటే అందరికీ గౌరవం ఉంది సార్. కానీ అసలు విషయం కన్నా అనవసరపు తలనొప్పి ఎక్కువగా ఉంది. ఉదయం విషయమే తీసుకోండి. జెండా వందనం జరిగింది రెండు నిమిషాలే. కానీ మేమంతా దాదాపు మూడు గంటలు ఎండలో మగ్గిపోవలసి వచ్చింది. కొంతమంది అయితే కళ్లు తిరిగి కూడా పడిపోయారు. దీనికేం చెప్తారు."

"ఏమ్మా ఓ విషయం చెప్పు. కేవలం మీరు నేషనల్ సెల్యూట్స్‌ని మాత్రమే చేసుకుంటున్నారా? లేదే! ఏనివర్సరీలనీ, టీచర్స్‌డే, ఫ్రెషర్స్‌డే... ఇలా రకరకాలుగా ఏవేవో ఫంక్షన్స్ చేసుకుంటూనే ఉంటారు. మరి వాటిని ప్లాన్డ్‌గానే చేసుకుంటారుగా. వీటినీ అలాగే చెయ్యండి. ఉదయం ఒక అరగంటలో జెండా వందనాన్ని కానిచ్చేసుకొని మీ ఉపన్యాసాలు, కల్చరల్ ప్రోగ్రామ్స్ ఈవినింగ్ పెట్టుకోండి. ఏదో రకాన్న దేశాన్ని స్మరించుకొనేలా చర్యలు తీసుకోండి. రేపటి తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత గల పదవిలో ఉన్న నీలాంటి ఉపాధ్యాయులే పలాయన వాదాన్ని, మనకెందుకు గోల అనే నిర్లక్ష్యానికి లొంగిపోతే...రేపటి మీ పిల్లలకి ఆగస్టు పదిహేను కేవలం ఓ మామూలు రోజుగానూ, ఇండియన్ ఫ్లాగ్‌లో మూడు రంగులుంటాయని మాత్రమే తెలిసే హీనస్థితి వస్తుంది" హెచ్చరికగా అన్నారు.

ఆయన మాటల్లోని వాస్తవం నా మనసును తాకింది. పిల్లలతో నాకున్న రిలేషన్‌ని సరిగ్గా వినియోగించుకుంటే ఉదయం అంత గందరగోళం ఎదురయ్యేది కాదనిపించింది. ఆయన అన్నట్లు బాధ్యత గల పదవిలో ఉన్న నేనే మూర్ఖంగా ప్రవర్తించినపుడు స్వేచ్ఛ తప్ప బాధ్యతలెరుగని పిల్లల తప్పేం ఉంది. నా ఆలోచనలలో నేనుగా మునిగి ఉన్న దానిని నమత "రండి మేడమ్" అన్న పిలుపునకు తేరుకొని ఆమెను అనుసరించాను. ఇంటికి కొస్త పక్కగా ఉన్న విశాలమైన స్థలంలో ఒక చిన్న గుడి దాని ఎదురుగా పొడవైన రాటకి గాలికి ఎగురుతున్న మువ్వన్నెల జెండా, దాని చుట్టూ పడి ఉన్న రాలిన పువ్వుల రేకలు...మరోపక్క సందడిగా బాణసంచా కాలుస్తూ అల్లరి చేస్తున్న పిల్లలు... ఇండియన్ మేప్‌లా అమర్చిన దీపాల కాంతులు, ఆ గుళ్లో త్రివర్ణ పతాకాన్ని ఒక చేత, మూడు సింహాల ముద్రిక మరో చేత ధరించి మాలాలంకృతురాలైన భారతమాత విగ్రహం సుశోభితంగా ఉన్నాయి. మరోపక్క ఏవో కల్చరల్ ప్రోగ్రామ్స్‌కి ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి.

"ఏమిటిదంతా?" కొస్త విస్మయంగా అడిగాను.

"ప్రతి యేడు మేము ఇలాగే సెలబ్రేట్ చేసుకుంటాం మేడమ్. మా తాతయ్య అన్నట్లు ఎవరో దేవుడు పుట్టాడని...మరెవరినో చంపాడనీ పండగలు జరుపుకునే మనం నీడైన నీరు, గాలి, శ్వాస, స్వేచ్ఛ ఇచ్చిన భారతమాత జన్మదినాన్ని మొక్కుబడిగా ముగించలేముగా మేడమ్. అందుకే ఈ ఏర్పాట్లు. వీళ్లంతా మా చుట్టుపక్కల పిల్లలు. వీళ్లలో మోతుబరుల పిల్లలే కాదు సామాన్యులు, కూలీల పిల్లలు కూడా ఉన్నారు. అమ్మ ఎవరికైనా అమ్మే కదా మేడమ్" నమత చెప్పింది.

నేను నోట మాట రానట్లు ఉండిపోయాను.

ఊకదంపుడు నీతులు చెప్పడానికీ ఆచరణలో అమలు చేయడానికీ ఉన్న వ్యత్యాసం అక్కడ కళ్లకి కట్టినట్లు కనిపించింది.

మనసు పెట్టి ఇష్టంగా చేసే పనిని ఎంత సంబరంగా, సంతోషంగా జరుపుకోవచ్చో స్పష్టంగా తెలిసింది. నా మనసులోని శంకలను చెరిపేసి నేనూ ఆ సందడిలో కలిసిపోయాను. మా వేడుకలకి మురిసిపోతూ మువ్వన్నెల జెండా సగర్వంగా రెపరెపలాడుతూ మా రాయల్ సెల్యూట్‌ని అందుకొంది.

## వైఖరి

హేమమాలిని తనయ ఈషా డియోల్ తన వైఖరిని మార్చేసుకున్నట్టుంది. యష్‌రాజ్ ప్రొడక్షన్స్ చిత్రంలో నటిస్తున్న ఆమె ఓ పాట కోసం తన నియమనిబంధనల్ని పక్కన పెట్టేసింది. 'ధూమ్' అని పేరు పెట్టిన ఈ చిత్రంలో ఆమె ఓ హాట్ సన్నివేశంలో నటించింది. మరో సంగతి ఏంటంటే ఈ సినిమా కోసం ఆమె సెక్సీ డ్రెస్‌లు వేసుకోవడానికి ఏమాత్రం వెనుకాడలేదట. గోవాలోని ఇరుకైన సందుల్లో అభిషేక్‌తో కలిసి చెట్టాపట్టాలేసుకు తిరిగిందట. ఇదంతా సినిమా కోసమే అయినా ఆమె చాలా సరదాగా చేసిందట.

